రైతన్నకు సల్ఫైడ్ దెబ్బ

పొలాలను దున్నేస్తున్న రైతులు
- కాంప్లెక్స్ ఎరువులు అధికంగా వాడడం వల్లే..
- యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న అధికారులు


చండూర్‌లో సల్ఫైడ్ కారణంగా వరి పొలాన్ని దున్నేస్తున్న రైతు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సల్ఫైడ్ దెబ్బతో ఆవేదన చెందుతున్నారు. మండలంలో ఈ యాసంగి సీజన్‌లో సుమారు 12 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇక్కడి రైతులకు బోరుబావులతో పాటు చెక్ డ్యామ్‌లు, మంజీర పరివాహక ప్రాంతాలు ఉండడంతో వరి సాగుకే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. వానకాలం సీజన్ కోతలు అయిపోయిన వెంటనే రైతులు నేలను ఆరబెట్టకుండా, వెంటనే నాట్లు వేయడంతో ఈ సారి రైతన్నకు సల్ఫైడ్ రూపంలో గట్టి దెబ్బ తగిలింది. సల్‌పెడ్డ్‌ను గుర్తించలేని రైతులు తమ పంట ఎండిపోవడంతో పలు రకాల మందులు పిచికారీ చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో చేసేదేమి లేక నాటేసిన పొలాలను దున్నేస్తున్నారు. పాడైన వరి సాగును దున్నేసిన రైతులు తర్వాత తిరిగి వరినే నాటేయడం గమనార్హం. సల్ఫైడ్ దుష్ప్రభావాలు కలిగిన పొలంలో అడుగుపెట్టగానే బుడగల రూపంలో నారు మారుతుందని, మొక్కను తీసివేస్తే కుళ్లిన కోడిగుడ్ల వాసన వస్తుందని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు తెలిపారు. ముఖ్యంగా నేలలో సల్‌పెడ్ దుష్ప్రభావ లక్షణాలు కలగడానికి కారణాలు ఎన్నో ఏళ్లుగా ఒకే పొలంలో క్రమం తప్పకుండా వరినే వేయడం. అధికంగా పాస్పరస్, యూరియా వాడకంతో పాటు క్రిమిసంహారక మందులు కలిపి చల్లడం. పోటాషియం, జింకు, సూక్ష్మధాతు పోషకాలు వాడకపోవడం. మడుల్లో అధిక నీరు నిల్వ ఉంచడం, దుక్కి సరిగ్గా దున్నకపోవడం, వరిపొలాలు కోసిన తర్వాత ఎండక ముందే తిరిగి నాటు వేయడం, పశువుల ఎరువులను వేయకపోవడం, ఎత్తైన నారు మడి యజమాన్యం చేయకపోవడం వీటన్నింటితో పాటు వాతావరణ పరిస్థితులు.


సల్ఫైడ్ లక్షణాలతో పాడైన పంట

సల్ఫైడ్ నివారణకు చర్యలు

సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించడంతో పాటు పొలాన్ని వీలైనంత ఎక్కువగా పంట మధ్యలో నెర్రలు వచ్చేవరకు ఆరబెట్టాలి. మురుగు కాల్వల సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి. సల్ఫైడ్ లక్షణాలు గుర్తిస్తే పంట సాగుకు ముందుగానే ఎర్రమట్టిని వేసి నేలలో కలియబెట్టాలి. చౌడు ఎక్కువగా నేలలో జింక్ సల్‌పెట్ 2 గ్రాములు, లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

రూ. 45 వేలు నష్టపోయా



చండూర్ గ్రామ శివారులో నాకున్న మూడెకరాల్లో వరి నాటు వేశా. పంటకు అన్ని సక్రమంగా అందిస్తున్న పంట ఎర్రగా మారిడంతో పలు రకాల మందులు పిచికారీ చేసిన ఎలాంటి ఫలితం లేదు. నాటేసిన మూడెకరాల వరి సాగును దున్నేశా. సుమారు రూ. 45 వేల పెట్టుబడి నష్టపోయా. దున్నేసిన పొలంలో మళ్లీ వరినే నాటేశా.

– వంకం జనార్దన్, రైతు, చండూర్

అవగాహన కల్పించాం



రైతులకు పంటమార్పిడి చేసుకోవాలని అవగాహన కల్పించాం. రైతులు ఎక్కువగా వరిసాగుకే ఆసక్తి చూపుతున్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి పంటకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలి. కోతలు అయిన వెంటనే నాటేసిన రైతులు జాగ్రత్తలు పాటించాలి. సల్ఫైడ్ దుష్ప్రభావాలు ఉన్న నేలలో తిరిగి వరి సాగు చేయడం సరికాదు. పంట దిగుబడి సక్రమంగా ఉండదు.

– రాజశేఖర్‌గౌడ్, ఏఓ, చిలప్‌చెడ్.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి


మాట్లాడుతున్న పార్టీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ మురళీధర్‌గౌడ్

నర్సాపూర్: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలని పార్టీ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ మురళీధర్‌గౌడ్ కోరారు. సోమవారం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ బలపర్చిన పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యలను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. తమ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సులోచన, పార్టీ నాయకులు పెద్ద రమేశ్‌గౌడ్, గద్దం శ్రీనివాస్, చిన్న రమేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల పరిశీలన


కొడిపల్లి ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లి ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గదులు, ర్యాంప్, పరిసరాలను పరిశీలించారు. ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు ఉండటంతో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలను తహసీల్దార్ ఆంజనేయులకు ఆదేశించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఎనిమిది మంది ఓటర్లు ఉండగా, పట్టభద్రుల ఎమ్మెల్సీని నాలుగు వందలకు పైగా ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా కేంద్రంలో విద్యుత్ సౌకర్యం, మంచినీరు, టాయిలెట్స్ ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఓటరు జాబితా ప్రదర్శన

మొత్తం ఓటర్లు 34 వేల 336


ఎంపీటీసీ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలో ఎంపీటీసీ ఓటర్ల జాబితాను సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రదర్శించారు. త్వరలోనే ప్రభుత్వం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నందున అందులో భాగంగా మండల ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచారు. మండల వ్యాప్తంగా 12 ఎంపీటీసీలకు పురుష ఓటర్లు 16,647 ఉండగా, మహిళా ఓటర్లు 17,688 మంది, ఇతరులు ఒక్క ఓటు ఉన్నట్లు మొత్తంగా 34 వేల 336 ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా తెలిపారు. అల్లీపూర్ 3096, చిన్నగొట్టిముక్ల 2729, చండీ 3229, దొంతి 3352, గోమారం 3933, నవాబుపేట 2028, కొంతన్‌పల్లి 3276, పాంబండ 2743, పిల్లుట్ల 2990, పెద్దగొట్టిముక్ల 2650, శివ్వంపేట 2349, గూడూర్ 1961 ఓటర్లు ఉన్నారు.

వైభవంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ


కొడిపల్లి(నర్సాపూర్): అగ్నిగుండాల వద్ద భక్తులు

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావ్‌పేటలో గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగ నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో గ్రామ పురోహితుడు ఉమాశంకశర్మ బృందం యంత్ర, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. అనంతరం రేణుక ఎల్లమ్మ కల్యాణం చేశారు. గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ కల్యాణోత్సవం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కూచన్‌పల్లి గ్రామ ఆలయంలో రేణుకామాత కల్యాణోత్సవాన్ని గౌడసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వేణు, అంకుశ్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య కనులపండుగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాన్ని తిలకించడానికి మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మల్లన్న జాతర

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంతో పాటు కంచన్‌పల్లిలో ఆయా గ్రామాల గోకుల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న జాతర భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఒగ్గుపూజారులు మల్లన్న కల్యాణం నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలు తొక్కి, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు.

మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

మెదక్ ఎమ్మెల్యే రోహిత్


రామాయంపేటలో ఎమ్మెల్యే రోహిత్‌ను సన్మానిస్తున్న యాదవ సంఘం సభ్యులు

రామాయంపేట(మెదక్): పట్టణంలో కొనసాగుతున్న మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు యాదవ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

చిన్నశంకరంపేట(మెదక్): రేణుకామాత అమ్మవారి ఆశీస్సులతో మెదక్ నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం మండలంలోని సూరారం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రేణుకమాత కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నీరజ, పవన్‌గౌడ్, రాజ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, అరుణ, నరేందర్, రాజిరెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలం రాజ్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ మండల యువత విభాగం అధ్యక్షుడు మల్లేశంతో పాటు మరికొంత మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మెదక్ మండల నాయకులు నాగరాజు, రాజు, కృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


బహుమతులు అందిస్తున్న పశు సంవర్ధక శాఖ ఏడీ, పాఠశాల ఉపాధ్యాయులు

నర్సాపూర్: పశు పోషణ, జంతుహింస నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించి పశుపోషణపై పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ జనార్దన్‌రావు విద్యార్థులకు పశు పోషణ, జంతు సంక్షేమంలో విద్యార్థులపాత్ర, జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులను వివరించి నివారణ అంశాలపై అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం విఠల్, ఉపాధ్యాయులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది రామకృష్ణ, గోవర్దన్, ఇగ్బాల్ తదితరులు పాల్గొన్నారు.

తగిన ఎత్తు, బరువు ఉండాలి


రహీంగూడతండాలో చిన్నారి ఎత్తు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సూపర్‌వైజర్ సంతోష

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిన్నారులు వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండాలని మండల ఇన్‌చార్జి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష అన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని రహీంగూడ, రహీంగూడ తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో 5 ఏళ్ల లోపు చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంతోష మాట్లాడుతూ.. తల్లులు తమ పిల్లలను ఎదుగుదలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, ఎదుగుదల సక్రమంగా లేకపోతే తాము సూచించిన పోషకాహారం ఇవ్వాలన్నారు. బలహీనంగా ఉన్న చిన్నారులపై అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, సరైన పోషకాహారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భూలి, మహిళలు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ బీసీ విభాగం నాయకులు

జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్

నర్సాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని బీసీలకు అన్యాయం చేస్తున్నారని బీఆర్ఎస్ బీసీ విభాగం నాయకులు జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శేఖర్ ఆరోపించారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం దుర్మార్గపు విధి విధానాలతో సర్వే చేయించి, 2014లో సర్వే కన్న ప్రస్తుతం బీసీ జనాభాను తక్కువ చూపించి బీసీలపై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. బీసీ జనాభాను 21లక్షలు తక్కువ చూపి, ఓసీలను 13శాతం పెంచారని తెలిపారు. కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సైతం ప్రభుత్వం చేసిన సర్వే సరిగా లేదని చెప్పడాన్ని వారు గుర్తు చేశారు. మళ్లీ సర్వే చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పలువురు కాంగ్రెస్ నాయకులు తమ పార్టీపై నిందలు వేయడాన్ని వారు ఖండించారు. డంప్‌యార్డు ఎత్తి వేయాలని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, హరికృష్ణ, రమణాగౌడ్, శివకుమార్, వెంకటేష్‌గౌడ్, ప్రసాద్, పరమేశ్వరరాజు, నర్సింలు, వీరేశ్, మాణయ్య, సేనాపతి, యాదాగౌడ్, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


పెద్దశంకరంపేట(మెదక్): బాలికల ఉన్నత పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవం

పెద్దశంకరంపేట(మెదక్): బాలికల ఉన్నత పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. కలెక్టర్‌గా పూజ, డిప్యూటీ కలెక్టర్‌గా రాఘవి, డీఈఓగా రాధిక, డిప్యూటీ డీఈఓగా ఆయేషా, ఎంఈఓగా నాగలక్ష్మి, హెచ్ఎంగా కీర్తన, ఉపాధ్యాయులుగా సరళ, మానస, అఖిల, శ్రీవల్లి వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ వెంకటేశం, ఉపాధ్యాయులు నాగవేణి, రాధిక, అశ్విని, సిద్ధిరాములు పర్యవేక్షించారు.


శివ్వంపేట(నర్సాపూర్): రత్నాపూర్‌లో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని రత్నాపూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవం జరుపుకొన్నారు. ఐదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయ పాత్ర పోషించి పాఠాలు బోధించారు. ఎంఈఓగా మనోహర్, హెచ్ఎంగా రితీష, మిగతా విద్యార్థులు ఉపాధ్యాయ పాత్ర పోషించారు. ఉపాధ్యాయ పాత్ర పోషించడం వల్ల వారిలో ఉన్న నైపుణ్యత వెలుగులోకి వస్తుందని హెచ్ఎం వెంకటేశం అన్నారు.


హవేళిఘణాపూర్(మెదక్): సర్దనలో..

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని సర్దన జెడ్పీ హైస్కూల్ సోమవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. జిల్లా కలెక్టర్‌గా మణిదీప్, డీఈఓగా ప్రవీణ, హెచ్ఎంగా మౌనిక, ఎంఈఓగా నందుతో పాటు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్ఎం జమీరుద్దీన్, ఉపాధ్యాయులు పర్యవేక్షించి, ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

క్లుప్తంగా

లీకేజీకి మరమ్మతులు


పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్: పట్టణంలో తాగునీటి పైపులైన్ లీకేజీకి మున్సిపల్ అధికారులు సోమవారం మరమ్మతులు చేపట్టారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన లీకేజీలతో ఇబ్బందులు అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. తమ సిబ్బందిని శివాలయం వీధికి పంపి ఆలయం వెనుక పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేసి నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకున్నారు. ఇదిలాఉండగా పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయించిన అధికారులు రోడ్డుపై తవ్విన గోతులను అలాగే వదిలేశారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ


డీఈఓ చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న శ్రీచరణ్‌గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): జిల్లా స్థాయిలో సోమవారం నిర్వహించిన భౌతిక, రసాయన శాస్త్ర టాలెంట్ టెస్ట్‌లో వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి శ్రీచరణ్‌గౌడ్ తృతీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్ఎం సాంబయ్య అన్నారు. ఈ సందర్భంగా డీఈఓ బహుమతి అందజేశారన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విద్యార్థికి హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అదేవిధంగా విద్యార్థిని గెలుపుకు కృషి చేసిన ఉపాధ్యాయులు వెంకటస్వామి, చార్లెస్, అమూల్యలను ప్రత్యేకంగా అభినందించారు.

నాణ్యమైన భోజనాన్ని అందించండి


కొల్చారం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మహిపాల్

కొల్చారం(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని నర్సాపూర్ ఆర్డీఓ మహిపాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాన్ని ఆర్డీఓ సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో తీసుకోవాల్సిన ఏర్పాట్లపై తహసీల్దార్ గఫార్‌మియాకు సూచనలు చేశారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు.

దైవదర్శనంతో మానసిక ప్రశాంతత


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): దైవ దర్శనంతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కర్నాల్‌పల్లిలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక వాతావరణం తప్పనిసరిగా ఉండాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, పీసీఎస్ చైర్మన్ కొండల్‌రెడ్డి, యాదగిరి, బాల్‌రెడ్డి, జర్నల్‌సింగ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను కాంప్లెక్స్ హెచ్ఎం విఠల్, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు ప్రసూన, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్, పాండురంగం, కిషోర్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్రవంతి, ఆనంద్, సుధీర్, ప్రవీణ్, కాశీరాం తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వారం రోజులుగా సర్వర్ డౌన్

శివ్వంపేట(నర్సాపూర్): వారం రోజులుగా ధరణి సర్వర్ డౌన్‌తో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారు. ధరణి పోర్టర్ సర్వర్ సక్రమంగా రాకపోవడంతో కార్యాలయానికి వచ్చిన అమ్మకం, కొనుగోలుదారులతో పాటు సాక్షులు అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం తర్వాత కొద్దిగా మెరుగ్గా రావడంతో రిజిస్ట్రేషన్లు నిర్వహించినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

◆ నేడు నీటి సరఫరాకు అంతరాయం

నర్సాపూర్: మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు మరమ్మతులు చేయాల్సి రావడంతో మంగళవారం నల్లాల ద్వారా మిషన్ భగీరథ నీళ్లు రావని ఏఈ రాజ్‌కుమార్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. హత్నూర మండలం దౌల్తాబాద్ నుంచి నర్సాపూర్‌కు ఉన్న పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్నామని చెప్పారు. మరమ్మతుల నేపథ్యంలో నర్సాపూర్, శివ్వంపేట, కొడిపల్లి, చిలప్‌చెడ్, కొల్చారం మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల్ల, జిన్నారం మండలాల్లోని గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. స్థానికంగా గ్రామాల్లో ఉండే నీటి వనరుల నుంచి నీటి సరఫరా చేపట్టాలని ఆయా శాఖల అధికారులను కోరారు.

◆ విద్యుత్ వైర్లు తెగిపడి సరఫరాకు అంతరాయం

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం శివారులో ఎంజేపీ పాఠశాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడి ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో వెంటనే అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది మండల కేంద్రానికి ప్రత్యామ్నాయంగా విద్యుత్ పునరుద్ధరించగా, ఎంజేపీ బాలికల, బాలుర పాఠశాలలకు కూడా ఇదే లైన్ నుంచి సరఫరా ఉండడంతో విద్యుత్ లేక విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అంతేకాకుండా ఔరంగాబాద్‌లోని కొన్ని వీధుల్లో కూడా సరఫరా నిలిచిపోయింది. దీంతో సోమవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సిబ్బంది రెండు స్తంభాలు విరిగిపోగా వాటిని మరమ్మతులు చేశారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనగా ఇరువైపులా రెండు స్తంభాలు విరిగాయని, అర్ధరాత్రి సమయంలో వైర్లు తెగిపడడంతో పెనుప్రమాదం తప్పిందని, వాహనాన్ని గుర్తించి చర్యలు తీసుకుంటామని ఏఈ వినోద్ తెలిపారు.

◆ సేవాలాల్ మందిర నిర్మాణానికి స్థలం ఇవ్వండి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలో సేవాలాల్ మందిరం నిర్మాణానికి స్థలం కేటాయించాలని సేవాలాల్ ఉత్సవ కమిటీ మండలాధ్యక్షుడు రెడ్యానాయక్ అన్నారు. సోమవారం కమిటీ సభ్యులు ఈ విషయమై చర్చలు నిర్వహించి, తహసీల్దార్ ముసాద్దీక్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.